

చిన్నారుల కళ్లకు భరోసా

ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ

రూ.50 వేలు లంచం తీసుకుంటూ వెల్దండ ఎస్‌ఐ ఏసీబీకి పట్టుబడ్డారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.2 /24.7

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

‘సైబర్’లో పురోగతి!

ఎనిమిది కేసుల్లో రూ.8.10 లక్షల రికవరీ

- ఏటా పెరుగుతున్న బాధితులు
- అవగాహనతోనే కట్టడి సాధ్యం
- సకాలంలో ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం



వనపర్తి: ఏటా పెరుగుతున్న సైబర్ నేరాలపై పోలీసులు ప్రజలను ఎంత చైతన్యం చేస్తున్నా.. అక్రమార్జనకు అలవాటు పడిన నేరగాళ్లు కొత్తదారులను ఎంచుకొని అమాయకుల డబ్బులు కొల్లగొడుతున్నారు. పెరిగిన మొబైల్ వినియోగం, ఆన్‌లైన్ లింక్ మెస్సేజ్‌లు, బహుమతులు, ఆన్‌లైన్‌లోన్ సౌకర్యం, గిఫ్ట్ ఓచర్లు, టాస్క్‌లకు ఆకర్షితులయ్యే వారిని ఎంచుకొని డబ్బులు కాజేస్తారని అవగాహన కల్పిస్తున్నా.. నిత్యం ఎక్కడో ఒకచోట అమాయకులు బలవుతూనే ఉన్నారు. ఇదిలా ఉండగా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి ఇప్పించడంలో టీజీసీఎస్‌బీ(తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో) కాస్త పురోగతి సాధించిందనే చెప్పవచ్చు. జిల్లాలో నమోదైన సైబర్ కేసుల్లో ఇప్పటి వరకు 8 ఛేదించిన పోలీసులు రూ.8.10 లక్షలు రికవరీ చేశారు.

ఏటా పెరుగుతున్న సైబర్ నేరాలు..

జిల్లాలో 2021 సంవత్సరంలో 26 కేసులు నమోదైతే.. 2022లో ఆ సంఖ్య 36కు, 2023లో 50కి చేరింది. 2024 సంవత్సరంలో ఇప్పటి వరకే 35 కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య గణనీయంగా పెరగడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ 457 కింద నమోదు చేయటంతో పాటు దర్యాప్తు కోసం స్టాండర్స్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)లను సిద్ధం చేసి గత ఫిబ్రవరిలో ఎస్పీ కార్యాలయాలు, జిల్లా లీగల్‌సెల్ అథారిటీలకు పంపించారు. దీంతో దర్యాప్తులో వేగం పెరుగుతోంది. గడిచిన నాలుగేళ్లలో సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా.

అప్రమత్తతతోనే కట్టడి..

వ్యక్తిగత వివరాలను వీలైనంత గోప్యంగా ఉంచుకోవడంతో పాటు ప్రత్యేకమైన పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటర్నెట్ సెంటర్లలో వ్యక్తిగత, కార్యాలయ ఈ–మెయిల్‌ను ఉపయోగించటం, పబ్లిక్ వై–ఫైని ఉపయోగించటంతోనూ కొన్ని ప్రమాదాలు తప్పవు. ఆఫీసర్స్ పేరుతో, క్షణాల్లో లోన్ సౌకర్యం పేరుతో వచ్చే ఆన్‌లైన్ లింక్‌లను ఓపెన్ చేసినా.. సైబర్ వలకు చిక్కే ప్రమాదం ఉంటుంది.

24 గంటల్లో ఫిర్యాదు చేయాలి..



సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి నగదు అపహరించారని గుర్తించిన వెంటనే 24 గంటల్లో టోల్‌ఫ్రీ నంబర్ 1930కి గాని నేరుగా పోలీసులకుగాని ఫిర్యాదు చేయాలి. దీంతో సైబర్ నేరగాళ్లు నగదు ఉపసంహరణ చేయకముందే ఖాతాను ఫ్రీజ్ చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఆలస్యం చేస్తే నగదు ఉపసంహరణకు అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటూ క్రైం చేసే వారి నుంచి తప్పించుకోవాలంటే ఉచితాలు, ఆఫర్ల పేరుతో వచ్చే ఆన్‌లైన్ లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలి.

– ఎన్‌బీ రత్నం, డీఎస్పీ, సైబర్ క్రైం, వనపర్తి జిల్లా

2024లో రూ.5.30 లక్షలు రికవరీ..

18 నెలల కాలంలో జిల్లాలో 85 సైబర్ కేసులు నమోదు కాగా.. ఇప్పటి వరకు రూ.8.10 లక్షల నగదు రికవరీ చేశారు. 2024 సంవత్సరానికి సంబంధించిన కేసుల్లో గరిష్టంగా రూ.5.30 లక్షలు రికవరీ చేశారు. అలాగే 2023 కేసుల్లో రూ.2.80 లక్షల నగదు రికవరీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి జూన్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెండు మెగా లోక్ అదాలత్‌లలో 5,142 కేసులకు సంబంధించి రూ.31.29 కోట్లు రికవరీ చేసిన విషయం విధితమే.. జిల్లాకు సంబంధించిన కేసులు ఇందులో 8 ఉండగా.. రికవరీ చేసిన మొత్తం నగదు రూ.8.10 లక్షలుగా అధికారులు వెల్లడించారు.

మత్తుకు బానిసైతే జీవితాలు చిత్తు



జిల్లాకేంద్రంలో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: యువత మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీసు, సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీకి కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు ఎస్పీ రక్షిత కె.మూర్తి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఏఎస్పీ రాందాస్ తేజావత్ హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత సిగరెట్, గుట్కా, పాన్‌మసాలా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని సూచించారు. గొప్ప కలలు కని వాటి సాకారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని.. ఎక్కడైనా మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినట్లు తెలిస్తే పోలీస్‌శాఖకు సమాచారం ఇవ్వాలని.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చెడుకు దూరంగా ఉండాలి : ఎస్పీ

యువత మత్తుకు బానిసై తమ భవిష్యత్‌తో పాటు కుటుంబ సభ్యుల జీవితాలను విషాదంలోకి నెట్టివేస్తున్నామనే నిజాన్ని మరచిపోవద్దని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలు సాధించడంపై దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. యువత చదువుతో పాటు వృత్తివిద్యపై దృష్టి సారిస్తే జీవితంలో అతి త్వరగా స్థిరపడవచ్చని తెలిపారు. అంతకుముందు జిల్లా సాంస్కృతికశాఖ కళాకారులు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను తమ పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లక్ష్మీబాయి, వివిధ శాఖల అధికారులు, మెడికల్, నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి వి.రజని

వనపర్తిటౌన్: మత్తు రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జాగృతి జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మత్తు నివారణ దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగాన్ని 1989 నుంచి అంతర్జాతీయంగా నిషేధించారని, గంజాయి, సిగరేట్లు తదితర మత్తు పదార్థాల ద్వారా మెదడుపై నియంత్రణ కోల్పోతారని తెలిపారు. గంజాయి సాగు, రవాణా, విక్రయం, కొనుగోలు, సేవించడం నేరమని.. అందుకు విధించే శిక్షలను వివరించారు. మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతున్నాయని.. యువత, విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జె.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డి.కృష్ణయ్య, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, కోర్టు సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

‘పుర కార్మికులకు పీఆర్సీ అమలు చేయాలి’



పెబ్బేరు రూరల్: పుర కార్మికుల థర్డ్‌పార్టీ కాంట్రాక్టు జీఓ ఉపసంహరించుకొని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు మర్రికుంట నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి 14 డిమాండ్ల వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా తీసుకొచ్చిన జీఓ నం.1037 వెంటనే ఉపసంహరించుకోవాలని, పీఆర్సీలో రూ.26 వేలుగా నిర్ణయించి ఇవ్వాలని, అంతలోపు ఆంధ్రప్రదేశ్‌లో చెల్లిస్తున్నట్లుగా కనీస వేతనం కార్మికులకు రూ.21 వేలు, ఇతరులకు రూ.23 వేలు చెల్లిస్తూ క్రమబద్ధీకరించాలన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించి థర్డ్‌పార్టీ కాంట్రాక్టు పద్ధతిన కొత్తగా నియమించుకునే ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నందిమళ్ల రాములు, మద్దిలేటి, యాదగిరి, బాలు, విజయ్, మన్యం, వెంకటమ్మ, భగవంతు, గంధం రాములు, గంగన్న, బక్కన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎంఈ కార్యాలయ ముట్టడికి సిద్ధం కావాలి



వనపర్తి: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంపు, ఏజెన్సీ నిర్వాహకుల అవినీతి అక్రమాలపై వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) కార్యాలయ ముట్టడికి కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఈ విషయమై జీజీహెచ్‌లో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, ఏజెన్సీ చేతివాటంతో దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐల పేరుతో వేతనాల్లో కోత విధిస్తున్నా.. ఖాతాల్లో జమ కావటం లేదని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి.గోపాలకృష్ణ, నాయకులు ఎస్.దేవానంద్, ఎంసీహెచ్ విభాగం కార్మికులు మోహన్‌నాయక్, అనిల్, భరత్, రవి, ఆంజనేయులు, మహేష్, ఉష, లక్ష్మి, కవిత, రాణి, నాగమణి, ప్రేమకుమారి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి..

ఖిల్లాఘనపురం: రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందితో మాట్లాడి కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ తదితర విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 5 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు దేవానంద్, కార్మికులు భీమయ్య, శివ, వెంకటేష్, మునీందర్, సాయి, ప్రియాంక, స్వాతి, సంగీత, రంగమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం

కొత్తకోట రూరల్: కొత్తకోట తైబజార్ వేలం శుక్రవారం నిర్వహించనున్నట్లు పుర కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల్లో చెల్లే విధంగా ‘కమిషనర్ కొత్తకోట’ పేరిట రూ.లక్ష డీడీ తీసి రూ.500 చెల్లించి దరఖాస్తు పొంది 27వ తేదీ సాయంత్రం 5లోగా కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు మొత్తంలో 25 శాతం డబ్బును మూడు రోజుల్లో జమ చేసి లీజు అగ్రిమెంట్ సబ్ రిజిస్ట్రార్, వనపర్తిలో పూర్తిచేసి సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛభారత్, హరితహారం తదితర అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయాలని, ప్రత్యేక అధికారులు వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ల హాజరు, మురుగు కాల్వల నిర్వహణ, నీటిట్యాంకుల శుభ్రత రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తేనే డెంగీ, మలేరియా, చికున్ గున్యావంటి వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. మిషన్ భగీరథ కొళాయిల సర్వే పూర్తి చేసినట్లు అన్ని పంచాయతీల నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో వ్యక్తిగత మరుగుదొడ్ల అవసరాలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో చేపల చెరువులు, నీటికుంటల ఏర్పాటుకు రైతులను ప్రోత్సహించాలన్నారు.

హరిత లక్ష్యం పూర్తి చేయాలి..

ప్రస్తుత వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 18 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించామని.. పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. అన్ని గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా పెద్ద మొక్కలు నాటించాలన్నారు. గ్రామాల పరిధిలోని లే అవుట్లు, పది శాతం భూమిని పంచాయతీకి కేటాయించిన వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, డీపీఓ కె.రమణ ఆయా మండలాలు, గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: వారం రోజుల్లో అమలులోకి రానున్న కొత్త చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కొత్త చట్టాలపై శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని.. అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం–2023పై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం సాధ్యమవుతుందని తెలిపారు. అరెస్ట్, వాంగ్మూలం నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అవసరాన్ని బట్టి ప్రజాభద్రత కోసం ఎన్నో చట్టాలను రూపకల్పన చేసినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించే దిశగా మార్పులు వస్తున్నాయన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కృష్ణకిషోర్, ఏఎస్‌ఐ బాషా, హెచ్‌సీ మూర్తి నూతన చట్టాలపై అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఎంతగానో కృషి చేశారని ఎస్పీ అభినందించారు.

ప్రశాంతంగా పాఠశాలల బంద్



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తిటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పాఠశాలల్లో మౌలిక వసతులు లేక, ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల ఫీజులు దండుకుంటున్నా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకుంటామంటూ హామీలిస్తూ చేతులు దులుపుకొంటుందని తెలిపారు. వెంటనే ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలకృష్ణ, రమ్య, కేదారీనాథ్, దేవి, అరవింద్, వినయ్, జ్ఞానేశ్వర్, వెంకటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేర మొక్కలు పెంచాలి

- ఆర్డీఓ పద్మావతి

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేర నర్సరీల్లో మొక్కలు పెంచి సంరక్షించాలని ఆర్డీఓ పద్మావతి నర్సరీ నిర్వాహకులకు సూచించారు. బుధవారం వనపర్తి మండలం అప్పాయిపల్లి నర్సరీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలుపు మొక్కలు పెరగకుండా చూడాలని, పూల మొక్కలు పెంచి రాబోయే హరితహారానికి సిద్ధం చేయాలని కోరారు. నర్సరీల్లోని పెద్ద మొక్కలు ఈసారి హరితహారంలో నాటే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి తదితరులు ఉన్నారు.



పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర: సీజన్ తగ్గడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. గత వారం కొంత తగ్గిన ధర బుధవారం జరిగిన వేలంలో మరింత పెరిగింది. దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటా గరిష్టంగా రూ.3,100, కనిష్టంగా రూ.2,510 పలికాయి. గత వారంతో పోలిస్తే గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.310 వరకు పెరిగాయి. 45 కిలోల బస్తా గరిష్టంగా రూ.1,550, కనిష్టంగా రూ.1,250 చొప్పున విక్రయించారు.

కొత్తకోణంలో విచారణ

మొలచింతలపల్లిలో నాగన్న మృతదేహానికి పోస్టుమార్టం

- చెంచు మహిళ ఈశ్వరమ్మ చిన్నమామ మృతిపై అనుమానాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు
- దాడిలోని ఇతర నిందితులపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు



నాగన్న (ఫైల్)



సాక్షి, నాగర్‌కర్నూల్: చెంచు మహిళ ఈశ్వరమ్మపై అమానుష దాడి నేపథ్యంలో నెలకొన్న కొత్త కోణంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 3న ఆమె చిన్నమామ నాగన్న(55) అనుమానాస్పద మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. ఈశ్వరమ్మపై పాశవిక దాడి నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే అనుమానాలు బలపడ్డాయి. దీంతో నాగన్న కుటుంబ సభ్యులు ఎస్పీ కార్యాలయంలో అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. బుధవారం జిల్లాలోని కొల్లాపూర్ మండలం, మొలచింతలపల్లిలో ఖననం చేసిన నాగన్న మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం కేసు దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు చెబుతున్నారు. అయితే గతంలోనూ చెంచు మహిళపై నిందితులు పాశవికంగా దాడి చేసిన వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈశ్వరమ్మపై దాడికి పాల్పడిన మిగితా నిందితులపై చర్యలు తీసుకోకపోవడంతో పోలీసుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దాడులు..

జిల్లాలోని చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ దందాలకు వినియోగించుకుంటూ, వారిపైనే వికృతంగా దాడులు చేయడం పరిపాటిగా మారింది. చెంచుల భూములను కౌలుకు తీసుకుని తక్కువ మొత్తంగా చెల్లింపులు చేస్తున్నారు. వారినే కూలీలుగా చేసుకుని బానిసలుగా చేసుకుంటున్నారు. భూ యజమాని అయిన ఈశ్వరమ్మ భూమిని కౌలు పేరుతో చేజిక్కించుకుని, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కూలీలుగా మార్చి, వారి భూమిని చౌకధరకే చేజిక్కించుకునేందుకు ప్రయత్నించిన ఉదంతం జిల్లాలో చోటుచేసుకుంది. భూ యజమానిపైనే పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలవరపెడుతోంది.

కొందరిపైనే కేసులు..

చెంచు మహిళ ఈశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్ కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు కలిసి అమానుషంగా దాడికి పాల్పడ్డారు. అయితే పోలీసులు బండి వెంకటేశ్, భార్య శివమ్మ, లింగస్వామి, లక్ష్మీపై కేసు నమోదు చేశారు. వెంకటేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. అమానుష దాడిలో పాలుపంచుకున్న మిగితా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈశ్వరమ్మపై గతంలోనూ సదరు వ్యక్తులు వికృతంగా దాడిచేసిన వీడియో ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఇందులో ఈశ్వరమ్మ కళ్లలో కారం చల్లుతూ, ఒంటిపై విచక్షణారహితంగా తన్నుతూ, కర్రలతో దాడులు చేస్తున్న దృశ్యాలున్నాయి. ఈ వీడియోలోని వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

చిన్నారుల నయనానికి భరోసా

- ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పాఠశాలల్లో జూలై 1 నుంచి కంటి వైద్యపరీక్షలు
- అవసరమైన వారికి కళ్లద్దాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే హామీ
- 1,000 మంది చిన్నారులకు ప్రయోజనం కలిగే అవకాశం



చిట్టెబోయిన్‌పల్లి గురుకులలో విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే చిన్నారుల కంటిచూపు మెరుగుపడనుంది. జూలై 1 నుంచి రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) వైద్యబృందాల ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. ఆ శిబిరాల్లో కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలోని కంటి విభాగంలో పరీక్షలు చేయించిన అనంతరం కంటి అద్దాలు ఉచితంగా ఇప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముందుకు వచ్చారు. దీంతో నియోజకవర్గంలో దాదాపు 1,000 మంది చిన్నారుల కంటిచూపు మెరుగుపడనుంది.

సమగ్ర కంటి స్క్రీనింగ్ శిబిరం అద్దాలు ఏవి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి 23 వరకు సమగ్ర కంటి స్క్రీనింగ్ శిబిరం పేరుతో ప్రభుత్వ గురుకులాలు, వసతిగృహాల్లో కంటి పరీక్షలు చేశారు. నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లో 126 మంది, రాజాపూర్ బాలానగర్ మండలాల్లో 110 మంది, నవాబుపేట మండలంలో 42 మందికి అత్యవసరంగా కంటి అద్దాలు అవసరమని శిబిరంలో నిర్ధారించారు. అయితే వారికి 2 నెలల్లో అద్దాలు ఇచ్చేలా చూస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ ఊసే లేకుండా పోయింది.

జూలై 1 నుంచి..

ఆర్‌బీఎస్‌కే వైద్యబృందాల ద్వారా జూలై 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు ప్రారంభించనున్నారు. ఆ పరీక్షల్లో కంటి సమస్య ఉన్న వారిని గుర్తించి జిల్లా కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ పరీక్షలు చేయిస్తారు. అలా పరీక్షలు జరిపిన వారిలో అద్దాలు అవసరమైన వారికి అద్దాలు ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు.



జిల్లా ఆస్పత్రిలో విద్యార్థికి కంటి పరీక్షలు(ఫైల్)

గతేడాది 634 మంది గుర్తింపు..

2023–24 ఏడాది విద్యాసంవత్సరంలో ఆర్‌బీఎస్‌కే బృందాలు జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్, నవాబుపేట మండలాల్లో 29,818 మంది విద్యార్థులకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో మొత్తం 634 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. వీరిలో ఆయా దాతల ఆధారంగా కేవలం 218 మందికి మాత్రమే అద్దాలు పంపిణీ చేయగలిగారు. మిగిలిన 416 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. ఇక హాస్టల్ విద్యార్థులు 278 మందిని కలుపుకొంటే మొత్తం 694 మందికి అద్దాలు పంపిణీ చేయాల్సి ఉంది.

కంటి సమస్య ఉన్నవారిని గుర్తిస్తాం



జూలై 1 నుంచి 6 నుంచి 18 ఏళ్ల వయస్సు విద్యార్థులందరికీ నియోజకవర్గంలో ఆర్‌బీఎస్‌కే 3 బృందాలతో వైద్య పరీక్షలు చేస్తాం. అలాగే గతేడాది అద్దాలు కావాలని గుర్తించిన వారికి మరోమారు పరీక్షలు చేస్తాం. వారందరిలో సమస్య ఉన్నవారిని జిల్లా కంటి ఆస్పత్రిలో చూయించి, అద్దాలు అవసరమని భావిస్తే జాబితా ఎమ్మెల్యేకు అందిస్తాం. మొత్తం 1,000 మంది వరకు అద్దాలు అవసరం అవుతాయని అంచనా. వారందరికీ ఎమ్మెల్యే అద్దాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

– డా.సునీల్, ఆర్‌బీఎస్‌కే, జడ్చర్ల

అద్దాలు ఇప్పిస్తా..



ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా.సునీల్ చిన్నారులకు కంటి అద్దాలు అవసరమని విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలో కంటి సమస్య ఉన్నవారిని గుర్తిస్తే వారందరికీ అద్దాలు ఇప్పిస్తా. ఈ ఏడాది 55,000 మంది విద్యార్థులకు షూ అందిస్తున్నాం. విద్యార్థులు బాగా చదువుకునేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తా. అందులో భాగంగానే అద్దాలు ఎంత మందికి అవసరమో గుర్తించి నాణ్యమైన అద్దాలు ఇచ్చేలా చూడమని ఆర్‌బీఎస్‌కే వైద్యులకు సూచించా.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల



బొటానికల్ గార్డెన్‌లో వికసించిన ఆర్కిడ్ జాతికి చెందిన జియోడోరమ్ లక్సిఫ్లోరమ్



వికసించిన ఆర్కిడ్ జాతికి చెందిన జియోడోరమ్ డెన్సిఫ్లోరమ్

బొటానికల్ గార్డెన్‌లో అరుదైన ఆర్కిడ్ పుష్పాలు

జడ్చర్ల: పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో బుధవారం రాత్రి అరుదైన ఆర్కిడ్ పుష్పాలు వికసించాయి. సాధారణంగా ఆర్కిడ్ జాతులు దట్టమైన అడవుల్లో తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పెరుగుతాయని.. మన దేశంలోని ఏపీ, పశ్చిమబెంగాల్, అసోం, చత్తీస్‌ఘఢ్, ఝార్ఖండ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో తేమతో కూడిన ఆకు రాల్చు అడవులలో మాత్రమే పెరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం సేకరించి బొటానికల్ గార్డెన్‌లో పెంచినట్లు చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ మొక్క పుష్పాలు వచ్చాయని, ఆ తర్వాత తెలంగాణలో ఇదే మొదటిసారిగా పుష్పాలు వికసించాయన్నారు. ఈ మొక్కల పెంపకం సున్నితంగా ఉంటుందని, మొక్కలకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు కల్పించామన్నారు. ఇలాంటి అరుదైన మొక్కలు బొటానికల్ గార్డెన్‌లో జీవ, వృక్షశాస్త్ర విద్యార్థులకు అందుబాటులో ఉండటం సంతోషించదగ్గ విషయమన్నారు. 30 సెం.మీ.,ల ఎత్తు పెరిగే ఆర్కిడ్ జాతికి చెందిన జియోడోరమ్ లక్సి ఫ్లోరం మొక్క 4– 8 పుష్పాలు మాత్రమే పుష్పిస్తుందన్నారు. లోపల ముదురు బంగారు వర్ణంలో ఉండి బయట లేత పసుపు రంగులో చాలా ఆకర్షణీయంగా ఉంటాయని పేర్కొన్నారు. దీనితోపాటు జియోడోరమ్ డెన్సిఫ్లోరం అనే ఆర్కిడ్ జాతి పుష్పం పుష్పించిందన్నారు. ఇది లేత తెలుపు ఉదారంగులో ఉండి లోపల పసుపు రంగు మచ్చలతో ఉంటుందన్నారు. బొటానికల్ గార్డెన్‌లో అరుదైన పుష్పాలు వికసించడంతో అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

క్లుప్తంగా

పుట్టిన రోజే చివరి వేడుకలు

- మరుసటి దినమే రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కుటుంబ సభ్యులతో మంగళవారం వేడుకలో మల్లేష్ (ఫైల్)

నవాబుపేట: పుట్టిన రోజు వేడుకలు జరుపుకొని భార్యాపిల్లలతో సంతోషంగా ఉన్న వ్యక్తి, ఒక్క రోజు వ్యవధిలోనే తన జీవితంలో ఆఖరి రోజై నూరేళ్లు నిండాయి. మంగళవారం మండల పరిధిలోని కిషన్‌గూడకి చెందిన గొల్ల మల్లేష్ తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నాడు. కాగా బుధవారం సొంత పనిపై వెళ్లి వస్తూ.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా మృతుడు ఇప్పాయిపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పుట్టిన రోజు జరుపుకొన్న మరుసటి రోజే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య పుష్ప, ఒక పాప ఉన్నారు.

పాముకాటుతో రైతు మృతి



కిష్టన్న (ఫైల్)

శాంతినగర్: పాము కాటుకు గురై ఓ రైతు మృతిచెందిన ఘటన వడ్డేపల్లి మండలం బుడమర్సులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు కుర్వ కిష్టన్న (70) ట్రాక్టర్‌తో పొలం పనులు చేయిస్తున్నాడు. అడ్డుగా ఉన్న రాయిని తొలగిస్తుండగా.. కింద ఉన్న పాము కాటేసింది. వెంటనే ఇంటికి చేరుకున్న కిష్టన్నను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

ట్రాక్టర్ బోల్తా : బాలుడి దుర్మరణం

శాంతినగర్: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన వడ్డేపల్లి మండలం తనగల శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అయిజ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన రఘుగౌడ్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కళ్యాణ్‌గౌడ్ (15) అయిజలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో వడ్డేపల్లి మండలం పచ్చర్లలో ఉండే బంధువుల వ్యవసాయ పొలంలో రూటర్ పనులు చేసేందుకు సొంత ట్రాక్టర్‌తో బయలుదేరాడు. మార్గమధ్యంలో తనగల శివారులో రహదారిపై ఉన్న లోతైన గుంతను తప్పించబోగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కళ్యాణ్‌గౌడ్‌పై ట్రాక్టర్ ఇంజిన్ పడటంతో సమీపంలోని రైతులు, రోడ్డుపై వెళ్తున్న వారు వెంటనే బయటకులాగి సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కిందపడిన నిమిషాల వ్యవధిలోనే మృతి చెందినట్లు ప్రత్యక్షులు తెలిపారు.

12 గంటలు.. 100 శస్త్రచికిత్సలు

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహణ



ఆపరేషన్ చేస్తున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ వైద్యులు, సిబ్బంది సాయంతో బుధవారం ఒకేరోజు వంద ఆపరేషన్లు చేశారు. ఈ ఆస్పత్రిలో ఈ నెల 5 నుంచి మెగా సర్జికల్ క్యాంపు కొనసాగుతోంది. ఇంతవరకు నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్, లింగాల మండలాలకు చెందిన రోగులకు శస్త్రచికిత్సలు చేయగా.. తాజాగా బుధవారం అమ్రాబాద్, పదర మండలాల వారికి ఆపరేషన్లు చేశారు. సర్జికల్ క్యాంపులో 1,230 మంది రోగులు వివిధ ఆపరేషన్లకు దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 475 పూర్తి చేశారు.

12 గంటల పాటు ఆస్పత్రిలోనే..

సర్జికల్ క్యాంపులో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆస్పత్రిలోనే ఉన్నారు. ఓ పక్క రోగులను పరీక్షిస్తూనే.. అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్సలు చేశారు. చిన్న కణతులు, హెర్నియా, కడుపులో గడ్డలు, గర్భసంచి శస్త్రచికిత్సలను ఎమ్మెల్యే ఎలాంటి ఖర్చు లేకుండా చేయడంతో పేదలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద రోగుల ఇబ్బందులను గుర్తించి క్యాంపు నిర్వహించామని, విజయవంతమైందని తెలిపారు. భవిష్యత్‌లోనూ మరిన్ని క్యాంపులు నిర్వహించి ప్రజలు, రోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని వివరించారు. సహకరించిన వైద్యులు, వైద్యసిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్క్రాప్ దుకాణంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు ప్రత్యక్షం



స్క్రాప్ దుకాణంలో ఉన్న పాఠ్యపుస్తకాల కట్టలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు బుధవారం రాత్రి స్క్రాప్ దుకాణంలో ప్రత్యక్షమయ్యాయి. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన పుస్తకాలుగా కనిపించాయి. పట్టణంలోని ఓ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన పాఠ్యపుస్తకాలను స్క్రాప్ దుకాణ యజమానికి అమ్ముతుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. పాఠశాల నుంచి ఓ ఆటోలో పుస్తకాలను దుకాణానికి తరలించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు కేటాయించిన పాఠ్యపుస్తకాలు స్క్రాప్ దుకాణానికి తరలించడమేంటని, డబ్బులకు కక్కుర్తి పడి అమ్మకానికి పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దుకాణం వద్దకు వచ్చి ఆటో, పాఠ్యపుస్తకాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. కాగా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌కు సంబంధించిన పుస్తకాలుగా దుకాణ యజమాని చెబుతున్నాడు.

పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

ధన్వాడ: పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానాను జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎండీ రఫీ విధించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన ఓ బాలికను శంషాబాద్ సిద్ధార్థనగర్‌కు చెందిన కారు డ్రైవర్ నర్సింహ ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని మోసం చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. గతేడాది సెప్టెంబర్ 16న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ రమేష్, సీఐ రాజేందర్ విచారణ చేసి నేరస్తుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించి సాక్ష్యులను ప్రవేశపెట్టగా బుధవారం నేరం నిరూపణ కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎండీ రఫీ నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాల్సిందిగా తీర్పునిచ్చారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐతో పాటు సిబ్బందిని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు.

గద్వాల జిల్లాలో మరొకరికి మూడేళ్ల జైలు..

గద్వాల క్రైం: బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో జిల్లా న్యాయమూర్తి కుషా మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చిందని ఎస్పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్ మండలానికి చెందిన ఓ బాలికపై తెలుగు జయరాం వ్యవసాయ పొలంలో అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై 12.08.2020న మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం సాక్షుల వాంగ్మూలం అనంతరం నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారని ఎస్పీ పేర్కొన్నారు.

ఫోన్‌కాల్‌తో ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్‌ఐ రవి, వ్యక్తిగత డ్రైవర్ విక్రమ్



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న మరో బాధితుడు ప్రవీణ్

ఓ చోరీ కేసులో తప్పించేందుకు రూ.50వేల డిమాండ్

- డబ్బులను ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- మరో కేసులో రూ.2లక్షలు డిమాండ్ చేశారని బాధితుడి ఆందోళన

వెల్దండ: చోరీ కేసు విషయంలో వ్యక్తిని తప్పించేందుకు లంచం డిమాండ్ చేసిన ఎస్‌ఐని ఏసీబీ అధికారులు ఫోన్‌కాల్ ఆధారంగా మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలంలోని ఓ క్రషర్ వద్ద కొందరు ముఠాగా ఏర్పడి ఈ నెల 21వ తేదీన జిలటిన్ స్టిక్స్, డిటోనేటర్లు ఎత్తుకెళ్లారు. వారిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వాటిని కొన్న కల్వకుర్తి పట్టణానికి చెందిన డేరంగుల వెంకటేష్‌ను పోలీసులు విచారించారు. అతను కేవలం వారు విక్రయిస్తే అవసరం ఉంటుందని ముందుజాగ్రత్తతో వాటిని ఇంట్లో పెట్టుకున్నాడు. కేసు విచారణకు 19వ తేదీన వెంకటేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐ పిలిపించారు. వెంకటేష్‌ను కూడా కేసులో నిందితుడిగా చేరుస్తామని బెదిరించారు. చేయని తప్పు నుంచి ఎలాగైనా తప్పించాలంటే రూ.50వేలు ఇవ్వాలని ఈ నెల 19వ తేదీన రాత్రి పోలీసులు రాజీ కుదుర్చుకున్నారు. కాగా అదేరోజు ఏసీబీ అధికారులకు బాధితుడు సమాచారం ఇచ్చాడు. కొన్ని రోజులుగా ఎస్‌ఐ, వెంకటేష్ మధ్య సంభాషణ కొనసాగగా, వారు ఏసీబీ అధికారులు మాటువేసి పట్టుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు నిరసన

ఎస్‌ఐ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలుసుకున్న బాధితుడు ప్రవీణ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఈయన తన పొలం పంచాయితీ విషయంలో ఎస్‌ఐ రవికుమార్‌గౌడ్ ట్రాక్టరును స్టేషన్‌కు తీసుకొచ్చి గత నెలలో కేసు నమోదు చేసినట్లుగా బాధితుడు తెలిపాడు. కేసు నమోదైనా ట్రాక్టర్‌ను కోర్టులో డిపాజిట్ చేయకుండా రూ.2లక్షల లంచాన్ని డిమాండ్ చేసినట్లుగా బాధితుడు చెప్పుకొచ్చాడు. ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయని, బాధితులు పోలీసులకు భయపడి ముందుకు రాలేకపోతున్నారని తెలిపాడు.

డబ్బులు తీసుకోమని డ్రైవర్‌తో చెప్పి..

గతంలో వెల్దండ పోలీస్ సర్కిల్ పరిధిలోని చారకొండ మండలంలో విధులు నిర్వర్తించిన కాలంలోనే ఎస్‌ఐకి గోకారంకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ విక్రమ్‌గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి పలుమార్లు ఎస్‌ఐతో పాటుగా వారి కుటుంబసభ్యులకు వ్యక్తిగతంగా డ్రైవింగ్ కోసం వెళ్లేవాడు. ఇలాగే మంగళవారం రాత్రి ఒకరు వచ్చి డబ్బులు ఇస్తారు.. తీసుకుని నీ దగ్గరనే పెట్టుకోమన్నారు. అప్పటికే వెల్దండలో ఎస్‌ఐ రవికుమార్‌గౌడ్ కోసం వేచిచూస్తుండగా, అతను జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో శిక్షణలో ఉన్నాడు. శిక్షణలో ఉండగానే డ్రైవర్ విక్రమ్, బాధితుడు వెంకటేష్ ఫోన్ కాన్ఫరెన్స్ ఉండి విషయం తెలియజేసి డబ్బులను తీసుకోమని ఎస్‌ఐ తెలిపారు. వీటన్నింటిని రికార్డు చేసి ఏసీబీ అధికారులు శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన ఎస్‌ఐతో పాటుగా డబ్బులు తీసుకున్న డ్రైవర్ విక్రమ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి మహబూబ్‌నగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో విచారించి, హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో వారిద్దరిని హాజరుపరిచినట్లుగా డీఎస్పీ తెలిపారు. కాగా.. వెల్దండలో ఆరు నెలల కాలంగా పనిచేస్తున్న ఈయనకు తన ప్రభావాన్ని చాటుకున్నాడనే చెప్పాలి. వచ్చిన నాటి నుంచి తన సామాజికవర్గం వారితో పరిచయాలు పెంచుకుని వారి ద్వారా రాయభారాలను సాగించే వారని ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చినట్లుగా తెలిసింది.

వానమ్మా.. రావమ్మా



జూన్ ముగుస్తున్నా జిల్లాలో సరైన వర్షాలు కురవడం లేదు. దీంతో ఇప్పటికే నాటిన ఆరుతడి పంటలు ఎండుముఖం పట్టగా.. వరి నారు పోసుకునేందుకు కూడా కార్తెలు కరిగిపోతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు వానమ్మా.. రావమ్మా అంటూ ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. మరోదిక్కు కొందరు మహిళలు కప్పకావడి కట్టి.. వరుణుడు కరుణించాలని పల్లె పాటలు పాడుతూ భిక్షాటన చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం జడ్చర్లలో కొందరు మహిళలు కప్పకావడితో అయ్యయ్యో వానదేవ.. రామోజీరామ అంటూ వరుణ దేవుడిని వేడుకుంటున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– జడ్చర్ల టౌన్

నేపాల్ క్రికెట్ పోటీలకు అద్నానుద్దీన్



మహబూబ్‌నగర్ క్రీడలు: నేపాల్ దేశం పోఖ్రాలోగల రంగసాల స్టేడియంలో బుధవారం నుంచి ప్రారంభమైన ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన ఎండి.అద్నానుద్దీన్ పాల్గొననున్నాడు. యూత్ గేమ్స్ క్రికెట్ పోటీల్లో అద్నాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సీనియర్ క్రికెటర్ అయిన తండ్రి ఎండీ.రియాజుద్దీన్ ప్రోత్సాహంతో కోచ్‌ల పర్యవేక్షణలో అద్నానుద్దీన్ క్రికెట్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. హెచ్‌సీఏ, ఎండీసీఏ క్రికెట్ మ్యాచుల్లో పాల్గొంటున్నాడు. అదే విధంగా గతంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాడు. అద్నానుద్దీన్ నేపాల్‌లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనడంపై జిల్లాలోని సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

జితేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



జితేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం, వాకిటి శ్రీహరి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఏపీ.జితేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా చాలా రంగాల్లో వెనుకబడి ఉందని, అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకారం అందించాలన్నారు. జిల్లాకు అధిక నిధులు తెచ్చేందుకు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని యెన్నం కోరారు.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతుంది. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా వచ్చేనీటిని నిలిపివేశారు. బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటి మట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

మిరప వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు

గట్టు: వానాకాలంలో మంచి రకం మిరప విత్తనాలు అందజేస్తామంటూ తమ దగ్గర నుంచి సుమారు రూ. 3 లక్షల దాకా వసూలు చేసి ఇవ్వకుండా పరారయ్యారని చాగదోణ రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ చేస్తే స్పందించడం లేదని రైతులు మౌలాలీ, ప్రహ్లాదస్వామి, శేఖర్, ఎర్రన్న, రమేష్, రంగయ్య వాపోయారు. తమను మోసం చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.